

చిన వెంకన్న సన్నిధిలో మంత్రి ఉషశ్రీచరణ్

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమలలోని శ్రీ వేంకటేశ్వరస్వామిని శుక్రవారం ఉదయం రాష్ట్ర స్త్రీ, శిశుసంక్షేమ శాఖ మంత్రి కెవి.ఉషశ్రీచరణ్ దర్శించుకున్నారు. తొలుత ఆమెకు ఆలయ ఇఒ వేండ్ర త్రినాధరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. మంత్రి స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఇఒ త్రినాధరావు దుశ్శాలువతో సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



మంత్రికి మెమెంటో అందిస్తున్న ఇఒ

మన్యం బంద్
విజయవంతం

బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో కలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని, గిరిజన, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్రవ్యాప్త బంద్ ఏలూరు జిల్లా పరిధిలోని గిరిజన మండలాల్లో సంపూర్ణంగా సాగింది. బంద్‌కు ఎపి గిరిజన సంఘంతోపాటు పలు ఆదివాసీ సంఘాలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు మద్దతు తెలిపి ప్రత్యక్ష కార్యాచరణలో పాల్గొన్నాయి. వ్యాపార సంస్థలు, దుకాణాలన్నీ మూతపడ్డాయి. ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయాలను మూయించివేశారు. గిరిజన ఎంఎల్‌ఎలు తమ పదవులకు రాజీనామా చేసి ఆందోళనకు మద్దతు పలకాలని కోరారు. లేనిపక్షంలో వారి ఇళ్ల ముట్టడికి వెనుకాడబోమని హెచ్చరించారు.



జీలుగుమిల్లిలో..

మూతపడిన దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాలు
స్తంభించిన వాహనాల రవాణా
అసెంబ్లీ తీర్మానం ఉపసంహరించుకోవాలని
నినదించిన గిరిజనులు, నేతలు



కుక్కునూరులో..

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో కలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని, గిరిజన, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్రవ్యాప్త బంద్ మండలంలో విజయవంతమైంది. బంద్‌కు ఎపి గిరిజన సంఘంతోపాటు పలు ఆదివాసీ సంఘాలు, ప్రజాసంఘాలు, పార్టీలు మద్దతు తెలిపి ప్రత్యక్ష కార్యాచరణలో పాల్గొన్నాయి. మండలంలోని వ్యాపార సంస్థలు, దుకాణాలన్నీ మూతపడ్డాయి. పలు ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయాలను మూయించివేశారు. అనంతరం జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా నాయకులు తెల్లం దుర్గారావు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిర్రి బాలరాజు, సంఘాల నేతలు కాకి మధు, వెట్టి సుబ్బన్న, మడకం వెంకటేశ్వరరావు, భూషణం మాట్లాడుతూ అభివృద్ధి చెందిన బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో కలపాలనుకోవడం దుర్మార్గమన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీలు తరతరాలుగా ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా వెనుకబడి జీవిస్తున్నారన్నారు. అలాంటి వారిలో బలమైన సామాజిక తరగతులైన బోయ వాల్మీకులను కలపడం దారుణమన్నారు. తక్షణం అసెంబ్లీ తీర్మానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆదివాసీ, గిరిజన సంఘాల నాయకులు, ప్రజలు సమిష్టిగా ఎస్‌టి ప్రజాప్రతినిధుల ఇళ్ల ముట్టడికి వెనుకాడబోమని హెచ్చరించారు.

కుక్కునూరు: బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలోకి చేర్చుతూ అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన తీర్మానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఎపి గిరిజన సంఘం, గిరిజన సమాఖ్య, ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలో చేపట్టిన ఏజెన్సీ బంద్ విజయవంతమైంది. మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలు, దుకాణాలు, హోటళ్లు, పెట్రోల్ బంకులు మూసివేసి అన్ని తరగతుల ప్రజలు బంద్‌కు సహకరించారు. ఎపి గిరిజన సంఘం, గిరిజన సమాఖ్య, ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు, గిరిజనులు అధిక సంఖ్యలో స్థానిక పాత రామాలయం సెంటర్ నుండి భద్రాచలం ప్రధాన రహదారి వరకు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టడంతో పెద్దసంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని నాయకులకు నచ్చజెప్పి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పోలోజు నాగేశ్వరరావు మాట్లాడుతూ బోయవాల్మీకులను ఎస్‌టి జాబితాలోకి చేర్చుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. గిరిజన సంఘం మండల కార్యదర్శి పట్టా లక్ష్మయ్య, నేతలు శ్యామల, లక్ష్మయ్య, గిరిజన సమాఖ్య నాయకులు వరసా నాగేశ్వరరావు, పాపారావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు సంజీవరావు, ప్రసాద్, నాగేశ్వరరావు, వేణు పాల్గొన్నారు.

బంద్‌కు వ్యకాస, సిఐటియు మద్దతు

బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దని శుక్రవారం చేపట్టిన ఏజెన్సీ బంద్‌కు వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు సంపూర్ణ మద్దతు ప్రకటించి నేతలు బంద్‌లో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రంశెట్టి నాగేంద్రరావు మాట్లాడుతూ బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చడం వల్ల ఏజెన్సీ గిరిజనులకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా చేసేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తుందని విమర్శించారు. వెంటనే ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు యర్ణం సాయికిరణ్, వలీపాషా పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: ఏజెన్సీ బంద్ మండలంలో సంపూర్ణంగా సాగింది. ఆదివాసీ, గిరిజన సంఘ నాయకులు కొవ్వాడ నుండి రౌతుగూడెం వరకు, బూసరాజుపల్లి మహిళా గురుకుల పాఠశాల వద్ద రహదారులను మూసివేశారు. దీంతో రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. మండలంలోని దుకాణదారులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, సినిమా హాళ్లు మూతపడ్డాయి. గిరిజన సంఘాల నేతలు మండలం అంతా తిరుగుతూ బంద్‌ను పర్యవేక్షించారు. మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద రోడ్డుపై బైఠాయించి నినదించారు.



బుట్టాయగూడెంలో..



పోలవరంలో..



వేలేరుపాడులో ర్యాలీ



టి.నరసాపురంలో..

కార్యక్రమంలో ఆదివాసీ ఐక్య కార్యాచరణ కమిటీ, ఆదివాసీ మహాసభ, అఖిలభారత రైతుకూలీ సంఘం, ఎపి గిరిజన సంఘం, ఆదివాసీ సంక్షేమ పరిషత్, సిఐటియు, ప్రజానాట్యమండలి నేతలు ఈ బంద్‌లో పాల్గొని విజయవంతం చేశారు. గిరిజన ఎంఎల్‌ఎలు వెంటనే తమ పదవులకు రాజీనామా చేయాలని, గిరిజనుల పోరాటానికి అండగా నిలవాలని కోరారు. సభలో ఆదివాసీ జెఎసి ఛైర్మన్ మొడియం శ్రీనివాసరావు, వైస్ ఛైర్మన్ కురసం దుర్గారావు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాసరావు, న్యూడెమోక్రసీ నాయకులు ఎస్.రామ్మోహన్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిర్రి బాలరాజు, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు కారం రాఘవ, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు కాకి మధు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ అసెంబ్లీ తీర్మానాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. లేనిపక్షంలో దశలవారీగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నేతలు టి.బాబూరావు, కెచ్చల పోతురెడ్డి, వెట్టి భారతి, మొడియం నాగమణి, కారం భాస్కర్, సర్పంచులు కారం లక్ష్మి, కొరస గంగరాజు, సరియం చెల్లయ్య దుర్గాప్రసాద్, తెల్లం దేవరాజ్, ఎంపిటిసి కొవ్వాసు గోవిందరాజు పాల్గొన్నారు.

వేలేరుపాడు: మండలంలో మన్యం బంద్ విజయవంతమైంది. తొలుత వేలేరుపాడు నుంచి పెద్దసంఖ్యలో మోటారు సైకిళ్లపై ర్యాలీ నిర్వహించారు. మేడేపల్లి వరకు ర్యాలీ సాగింది. అనంతరం ఎపి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ధర్ముల రమేష్ అధ్యక్షతన స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో నిర్వహించిన సభలో వివిధ సంఘాల నేతలు మాట్లాడారు. బంద్ సందర్భంగా మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలు మూతపడ్డాయి. ఈ కార్యక్రమాల్లో మడివి దుర్గారావు, సోడే సీతారామయ్య, ఊకే ముత్యాలరావు, కారం దారయ్య, బంధం ప్రసాద్, మిరియాల శ్రీను, మడకం దుర్గాప్రసాద్, సోయం సీతామహాలక్ష్మి, పూరెం జ్యోతి, ఊకే రాధ, బాడిస రాము, రామవరం సర్పంచి పిట్టా ప్రసాద్ పాల్గొన్నారు.

పోలవరం: గిరిజనుల హక్కులకు భంగం కల్గిస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఆదివాసీ నేత బొరగం భూచంద్రం అన్నారు. మండలంలోని గిరిజన గ్రామాల్లో ఏజెన్సీ బంద్ విజయవంతంగా నిర్వహించారు. గిరిజన నేతలు పోలవరంలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలను మూయించి వేశారు. కార్యక్రమంలో భూచంద్రంతోపాటు సాయికృష్ణ మాట్లాడుతూ ఆర్అండ్ఆర్ కాలనీల్లో కనీస సౌకర్యాలు లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో చలపతిరావు, పలువురు నేతలు పాల్గొన్నారు.

21 గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలి

టి.నరసాపురం: గిరిజన సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన మన్యం బంద్‌కు మద్దతుగా సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని రామమ్మగూడెం, అల్లూరి సీతారామరాజు నగర్, బచ్చులేటిగూడెం గ్రామాల్లోని పోడు భూముల్లో నిరసన తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా నాన్ షెడ్యూల్ ఉన్న గ్రామాలను ఐదో షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు మడకం సుధారాణి, అనుమాలు మురళి, భూక్య వేణు, మడకం కుమారి, తుట్టి దుర్గ, పాయం దుర్గారావు పాల్గొన్నారు.



ధాన్యం సేకరణ సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

రబీ ధాన్యం సేకరణలో క్షేత్రస్థాయి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు అధ్యక్షతన మండలి సమీక్షా సమావేశం జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రైతుభరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. గత ఖరీఫ్‌లోని అనుభవాలను దృష్టిలో ఉంచుకొని రబీలో ఆ అంశాలు పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గోనె సంచులు, రవాణా సౌకర్యంపై ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో 60 లక్షల గోనె సంచులను సిద్ధం చేయాలన్నారు. ధాన్యం సేకరణకు సంబంధించి క్షేత్రస్థాయి సమస్యలను కంట్రోల్ రూం ద్వారా రోజూ పర్యవేక్షించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ధాన్యం సేకరణ ప్రారంభించే ముందు టెక్నికల్ పర్సన్ ద్వారా తేమ మీటర్లన్నింటిని క్రమాంకనం చేయాలని ఆదేశించారు. రామసింగవరం గ్రామంలో 25 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ, 25 ఎకరాల్లో నర్సరీ పెంపకానికి భూమి కేటాయింపుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని మండలాల నుండి పచ్చిరొట్ట ఎరువు అవసరాన్ని సేకరించి ఎపి సీడ్స్ కు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. జిల్లాలో పచ్చిరొట్ట ఎరువుల ధరలను ఖరారు చేసిన వెంటనే పంపిణీ ప్రారంభిస్తారన్నారు. దెందులూరు ఎంఎల్‌ఎ అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ దెందులూరులో సాగునీటికి అవసరమైన పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. కాలువ శివారు భూములకు సాగునీరు అందించేందుకు శనివారం నుంచి కృష్ణా నుండి 800 క్యూసెక్కుల నీరు విడుదల చేయడం జరుగుతుందని చెప్పారు. గోదావరి నుండి వచ్చే నీరు సక్రమంగా కాలువ శివారు ప్రాంతాలకు చేరేలా ప్రత్యేక అజమాయిషీ చేపట్టాలన్నారు. ఎంఎల్‌ఎలు పుప్పాల వాసుబాబు, దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ రబీ సీజన్ లో ధాన్యం సేకరణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. గోనె సంచుల సరఫరా, రవాణా సౌకర్యంపై మరింత ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ సమావేశంలో బోర్డు సభ్యులు ఆళ్ల సతీష్ చౌదరి, వైఆర్‌కెపిఆర్.బాబ్జి, పి.రవీంద్రరెడ్డి, పి.హరిబాబు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి వై.రామకృష్ణ, మైక్రోఇరిగేషన్ పీడీ రవికుమార్, ఎల్‌డిఎం వెంకటేశ్వరరావు, మత్స్య, మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



వినతి అందిస్తున్న నేతలు

ప్రత్యేక పంచాయతీ కోరుతూ ఆందోళన

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రత్యేక గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రత్యేక పంచాయతీ పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపిడిఒ ఎన్‌టి.స్వామి, తహశీల్దార్ కార్యాలయంలో డిటిలకు వినతిపత్రం అందజేశారు. తొలుత మండలంలోని పుట్రేపు అడ్డరోడ్డు వద్ద వంటావార్పు చేపట్టారు. ఏడు గ్రామాల ప్రజలు టి.నర్సాపురం హైస్కూల్ సెంటర్ నుంచి ర్యాలీగా బయల్దేరి ఎంపిడిఒ కార్యాలయం వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడు గ్రామాలను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేసేందుకు గ్రామసభ నిర్వహించాలని తీర్మానానికి డిమాండ్ చేశారు. గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలని, పుట్రేపు రోడ్డు సౌకర్యం కల్పించాలని, అల్లూరి సీతారామరాజు నగర్ గుడిసెవాసులకు విద్యుత్, తాగునీరు సౌకర్యం కల్పించాలని, రోడ్లు, మరుగుదొడ్లు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి సిపిఎం మద్దతు తెలిపింది. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ, ప్రత్యేక గ్రామ పంచాయతీ పోరాట కమిటీ నాయకులు భూక్యా వేణు, కుంజా కిరణ్, భూక్యా శ్రీనివాస్, పండు భద్రం, మట్ట శ్రీను, బరగడ రాముడు, కురం వెంకటేశ్వరరావు, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు మడకం కుమారి, పెట్ల మంగ, మండల కమిటీ సభ్యులు అనుమోలు మురళీ, మడకం సుధారాణి పాల్గొన్నారు.

అకాల వర్ష బాధిత రైతులకు పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి - ఏలూరు

అకాల వర్షాలు, వడగళ్ల వానలతో పంట నష్టపోయిన రైతాంగానికి పంటల బీమా పరిహారం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక అన్నే భవనంలో జరిగిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అకాల వర్షాలతో వర్జీనియా పొగాకు, మొక్కజొన్న, మిర్చి, మామిడి, అరటి తదితర పంటలకు నష్టం వాటిల్లి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు ధీమా.. ప్రధానమంత్రి ఫసల్ బీమా అని కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున ప్రచారం చేసిందని, ఆచరణలో పంటల బీమా పథకం రైతులకు అమలు కావడం లేదని అన్నారు. ఏ మేరకు పంట నష్టం జరిగితే ఆ మేరకు ఎన్యుమరేషన్ చేసి ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలన్నారు. గోదావరి డెల్టా శివారు ప్రాంత భూములకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. రబీ ధాన్యం కొనుగోళ్లలో వస్తున్న సమస్యలను రైతులు, రైతుసంఘాలతో చర్చించి ముందుగానే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పల్లపోతు రెడ్డియ్య, తలారి జయరాజు, దన్నే నాగేంద్రరావు పాల్గొన్నారు.

సమస్యలపై దద్దరిల్లిన కౌన్సిల్

పనులు చేయకపోవడం అవమానకరం.. ఆత్మహత్య చేసుకుంటా
పెట్రోలు బాటిల్‌తో కౌన్సిలర్ సంకు సురేష్ కంటతడి
రెండేళ్లయినా ప్రగతి ఏదంటూ గళమెత్తిన అధికారపక్షం
వాడీవేడిగా జంగారెడ్డిగూడెం నగర పంచాయతీ సమావేశం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

'పట్టణంలోని సమస్యలు పరిష్కరించకపోతే ప్రజలకు ముఖం చూపించేదెలా.. తాము కౌన్సిలర్‌గా ఎన్నికై రెండేళ్లయినా వార్డులో ఒక్క పనీ చేయించుకోలేని దుస్థితి ఉంది.' అంటూ నగర పంచాయతీ సమావేశంలో కౌన్సిలర్‌లు గళమెత్తారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయ సమావేశపు హాలులో ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి అధ్యక్షతన పాలకవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో కమిషనర్ పి.భవానిప్రసాద్ 34 అంశాలతో కూడిన ఎజెండాను, మరో రెండు అంశాలతో కూడిన టేబుల్ అజెండాను సమావేశంలో ప్రవేశపెట్టారు. ఈ నేపథ్యంలో పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ తమ వార్డుల్లోని సమస్యలను ప్రస్తావించారు. తొమ్మిదో వార్డు కౌన్సిలర్ సంకు సురేష్ మాట్లాడుతూ ఏడాదిన్నరగా తన వార్డులో ప్రధాన సమస్య కల్వర్టు నిర్మాణానికి రూ.5 లక్షలు, సీసీ రోడ్డు నిర్మాణానికి మరో లక్షన్నర నిధులను మంజూరు చేస్తు మున్సిపల్ కౌన్సిల్ తీర్మానించిందన్నారు. అయితే నేటికీ ఆ పనులకు సంబంధించి ఒక్క ఇటుకను కూడా వేయలేదన్నారు. దీంతో ప్రజలు తనను చులకనగా చూస్తున్నారని, దీంతో వారికి ముఖం చూపించలేకపోతున్నానంటూ భావోద్వేగానికి గురయ్యారు. తనవెంట తీసుకొచ్చిన పెట్రోల్ బాటిల్‌ను చూపుతూ ఈ అవమానాలను తట్టుకోలేనని, ఆత్మహత్య చేసుకుంటానని కంటతడి పెట్టారు. వెంటనే పక్కనే ఉన్న కౌన్సిలర్ వలవల తాతాజీ అప్రమత్తమై సురేష్ చేతిలోని పెట్రోలు బాటిల్‌ను లాక్కుని సముదాయించే ప్రయత్నం చేశారు. ఈ ఘటనతో అంతా అవాక్కయ్యారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి స్పందిస్తూ సంకు సురేష్ వార్డులో కల్వర్టు, డ్రెయినేజీ నిర్మాణానికి టెండర్లు పిలిచినప్పటికీ కాంట్రాక్టర్లు ముందుకు రాక జాప్యం జరిగిందన్నారు. అయినప్పటికి కాంట్రాక్టరుతో మాట్లాడి పనులు ప్రారంభింపజేస్తామని హామీ ఇచ్చారు. వైస్ ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు మాట్లాడుతూ కాంట్రాక్టర్లతో 15 రోజులకు ఒకసారి సమావేశం ఏర్పాటు చేసి అభివృద్ధి పనులు సకాలంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని ఛైర్‌పర్సన్‌ను కోరారు. కాంట్రాక్టర్ల బిల్లులు సిఎఫ్‌ఎంఎస్‌లో అప్‌లోడ్‌లో ఆలస్యంపై కాంట్రాక్టర్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. ఒక వార్డులోనే పనులు జరగడం, మిగిలిన వార్డుల్లో ఏ పనీ చేయకపోవడం సరికాదని తెలిపారు. కాంట్రాక్టర్లను ఒప్పించి పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కౌన్సిలర్ పిపిఎస్.చంద్రరావు మాట్లాడుతూ సీసీ రోడ్ల మరమ్మతులకు రూ.15 లక్షలు కేటాయించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. గతేడాది నిర్మించిన బుట్టాయగూడెం రోడ్డులో గోతులు పూడ్చడానికి రూ.5 లక్షలు ప్రజాధనం వృథా అయ్యిందన్నారు. తాను కౌన్సిలర్‌గా, వైసిపి పట్టణాధ్యక్షునిగా ఉన్నప్పటికీ సిబ్బంది నుంచి ఎదురైన అవమానాలను వివరించారు. 19వ వార్డు కౌన్సిలర్ ఇందిరా ప్రియదర్శిని మాట్లాడుతూ ఏడాదిన్నర కిందట ఆమోదించిన డ్రెయినేజీ పనులు నేటికీ పూర్తి కాలేదన్నారు. మున్సిపాల్టీ పన్నుల్లో డబుల్ ఎంట్రీలుగా ఉన్న 242 ఎసెస్‌మెంట్‌లను తొలగించాలనే అంశంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేసారు. దీనిలో అధికారుల కుంభకోణం ఉందని ఆరోపించారు. అయితే డబుల్ ఎంట్రీ ఎసెస్‌మెంట్‌ల వల్ల కొందరు పేదలు ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారని, వాటిని తొలగించాలని వైస్‌ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, కౌన్సిలర్లు పిపిఎస్ చంద్రరావు, వలవల తాతాజీ సూచించారు. దీనిపై ఇందిరా ప్రియదర్శిని స్పందిస్తూ డబుల్ ఎంట్రీ ఎసెస్‌మెంట్‌లపై విచారణ జరపాలని కమిషనర్ పి.భవానిప్రసాద్‌ను కోరారు. కౌన్సిలర్ లోకారపు వెంకటేశ్వరావు తన వార్డులో సాలిపేట రోడ్డు నిర్మాణం చేపట్టాలని మరో ఇద్దరు కౌన్సిలర్లతో కలిసి ఛైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందించారు. 12వ వార్డు కౌన్సిలర్ షేక్ రహీమా మాట్లాడుతూ కుక్కల బెడద పెరిగిందని, సమస్యలు పరిష్కారం కావడం లేదని తెలిపారు. తాగునీటి సమస్యపై సచివాలయ కార్యదర్శులకు ఫోన్ ద్వారా తెలియజేసినా స్పందించడం లేదన్నారు. మున్సిపల్ కుళాయిలకున్న మోటార్ల తొలగింపులో అధికారులు నిర్లిప్తత వహిస్తున్నారని విమర్శించారు. 28వ వార్డు కౌన్సిలర్ కె.లావణ్య మాట్లాడుతూ తన వార్డులో రోడ్లు, డ్రెయినేజీ సమస్యతోపాటు వీధి దీపాల సమస్య తీవ్రంగా ఉందన్నారు. కౌన్సిలర్ ధనలక్ష్మి మాట్లాడుతూ డంపింగ్ యార్డులో చెత్తకు నిప్పుపెట్టడం వల్ల సమీప ప్రాంతాలు ఇందిరానగర్, వైఎస్ఆర్ కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.



పెట్రోల్ బాటిల్ లాక్కుని సురేష్‌ను వారిస్తున్న తోటి కౌన్సిలర్లు

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

వైఎస్ఆర్ జగనన్న బడుగు వికాసం కింద 22 యూనిట్లకు రూ.128.56 లక్షల సబ్సిడీ మంజూరు
కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి పటిష్టమైన చర్యలు చేపట్టి పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ సమావేశం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెదవేగి మండలం రామసింగవరంలో 50 ఎకరాల భూమిని ఆయిల్ ఫెడ్ లిమిటెడ్ వారికి నూతనంగా పరిశ్రమ, నర్సరీ ఏర్పాటుకు కేటాయించేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎపిఐఐసి డిజెడ్ఎం ధీవన్‌ను ఆదేశించారు. వట్లూరు, భోగాపురం గ్రామాల్లో 25 ఎకరాల్లో ఎంఎస్ఎంఇ పార్కు ఏర్పాటుకు సంబంధించిన చర్యలు వేగవంతం చేయాలని ఎపిఐఐసి జోనల్ మేనేజర్‌ను ఆదేశించారు. ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లిలో ఎంఎస్ఎంఇ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేసి వైఎస్ఆర్ జగనన్న బడుగు వికాసం కింద యూనిట్లు నెలకొల్పేందుకు స్థానిక ఎంఎల్‌ఎతో కలిసి ఎపిఐఐసి జోనల్ మేనేజర్, జిల్లా పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజరు సంయుక్తంగా భూమి పరిశీలించి నివేదిక సమర్పించాలని కోరారు. పిఎంఇజిపి రుణాలు సత్వరం జాప్యం లేకుండా ప్రోసెస్ చేయాలని ఎల్‌డిఎంను ఆదేశించారు. ముద్ర రుణాలు, జగనన్న తోడు, ప్రధానమంత్రి స్వానిధి వంటి వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఉద్దేశపూర్వక ఎగవేతదారుల పట్ల బ్యాంకువారు అప్రమత్తంగా ఉండాలన్నారు. కొల్లేరు కాంటూరు పరిధిలో పరిశ్రమల స్థాపనకు ప్రతిబంధకంగా ఉన్న వివిధ నిబంధనలకు సంబంధించి పూర్తి వివరాలు సేకరించి తెలియజేయాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వైఎస్ఆర్ జగనన్న బడుగు వికాసం కింద 22 యూనిట్లకుగాను రూ.128.56 లక్షల రాయితీ మొత్తం విడుదలకు కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. సింగిల్ విండో పోర్టల్‌లో 272 దరఖాస్తులురాగా అందులో 255 నిర్దేశించిన గడువులోగా ఆమోదించబడ్డాయన్నారు. మిగిలిన దరఖాస్తులను కూడా పెండింగ్ లేకుండా గడువు తేదీలోపు ఆమోదించాలని జిల్లా కాలుష్య నియంత్రణ, ఫైర్ సర్వీసెస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఎంఎస్ఎంఇ కింద ఆయా యూనిట్లకు అందించిన రుణ వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. దీనిపై ఎల్‌డిఎం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో పిఎంఇజిపి కింద రూ.43.71 కోట్లు, జగనన్నతోడు, పిఎంస్వానిధి కింద రూ.43 కోట్లు, ముద్ర రుణాల కింద రూ.406 కోట్లు అందించామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 13 మ్యానుఫ్యాక్చరింగ్ ఇండస్ట్రీలకు రూ.73.93 కోట్లు, మేజర్ ఎంఎస్ఎంఇ కింద రూ.41 కోట్లు వివిధ బ్యాంకుల ద్వారా క్రెడిట్ సదుపాయం అందించినట్లు వివరించారు. జిల్లాలో ఎంట్రప్యూనర్ డెవలప్ మెంట్ ప్రోగ్రాం(ఈడిపి) కింద ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకొచ్చేలా అవగాహన కల్పించాలని సూచించారు. నూతన పారిశ్రామిక విధానం 2023-27 గురించి జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పి.ఏసుదాసు వివరించారు. సమావేశంలో డిపిఒ జివికె.మల్లికార్జునరావు, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ వెంకటేశ్వరరావు, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ సాల్మన్‌రాజు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి వై.రామకృష్ణ, మైక్రోఇరిగేషన్ పీడీ రవికుమార్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఎ.త్రినాధరావు, కాలుష్య నియంత్రణ మండలి ఇఇ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇవిఎం గోదాంను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

ఇవిఎం గోదాంను కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ శుక్రవారం పరిశీలించారు. స్థానిక కలెక్టరేట్‌లో ఉన్న ఇవిఎం యంత్రాలు, వివి ప్యాట్ భద్రపరిచే గోదాంను రెవెన్యూ శాఖ ఎన్నికల విభాగం అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఇవిఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు ఇవిఎం, వివిప్యాట్ గోదాంను క్షుణ్ణంగా తనిఖీచేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. ఇవిఎం, వివిప్యాట్ మిషన్ల భద్రతకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇవిఎం గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. పలు సూచనలు చేశారు. కలెక్టర్‌తో పాటు ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ప్రసాద్, సిబ్బంది కె.లక్ష్మీనారాయణ ఉన్నారు.

దోమలను నిర్మూలించాలి : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

దోమల నిర్మూలనలో ప్రజలు భాగస్వామ్యం కావాలని డిఎంహెచ్‌ఒ డి.ఆశ సూచించారు. డ్రై డే కార్యక్రమంలో భాగంగా ఏలూరు అర్బన్ హెల్త్ సెంటర్ తంగెళ్లమూడి ఎంఆర్‌సి కాలనీ-2 సచివాలయం పరిధిలో కట్టడ్రీగూడెం ప్రాంతంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రజలకు డ్రై డేపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యుపిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కిరణ్, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ గోవిందరావు, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఎఎన్‌ఎంలు రహమున్నిసా ఆర్.బేగం, శ్యామల, సుకన్య, శారద, రాజ్యం, ఆశా కార్యకర్తలు ఉమాదేవి, కమల, దుర్గ, రాజ్యలక్ష్మి, ఈశ్వరి, ప్రమీల, సత్యవతి, కమల పాల్గొన్నారు.



సొసైటీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న రైతులు

మూడు పంటలకూ ధాన్యం, హమాలీ ఖర్చులు రాలేదు

నారాయణపురం సొసైటీ సర్వసభ్య సమావేశంలో రైతుల ఆవేదన

ప్రజాశక్తి - ఉంగుటూరు

వరుసగా సార్వా, దాళ్వా, సార్వా మూడు పంటలకు సంబంధించిన సాగు చేసిన వరి రైతులకు ధాన్యం తోలినందుకు క్వింటాలుకు రూ.25 హమాలీ ఛార్జీలు ఇస్తామని ప్రభుత్వం చెప్పిన మాటలు పూర్తిగా నెరవేరలేదని పలువురు రైతులు వాపోయారు. నారాయణపురం సొసైటీ మహాజన సభ శుక్రవారం త్రిసభ్య కమిటీ ఛైర్పర్సన్ యెలిశెట్టి పాపారావుబాబ్జి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ 40 కేజీల ధాన్యం బస్తాకు రూ.10 రావాల్సి ఉండగా కొంతమందికి రూ.8, 9లే వచ్చాయన్నారు. మరి కొందరికి ఒక్కరూపాయి కూడా రాలేదన్నారు. ధాన్యం అలీజిలు వద్ద తేమ శాతాన్ని పరిగణలోకి తీసుకోవాలని, మిల్లర్ల తేమ శాతం పేరుతో కోతలు విధించడం సరికాదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఛైర్పర్సన్ బాబ్జి మాట్లాడుతూ సార్వా పడిన ఇబ్బందులు, గుర్తించిన సమస్యలను ఈ దాళ్వాలో ఎదురవ్వకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఏప్రిల్ ఏడో తేదీ నుంచి పదో తేదీ లోపు ధాన్యం కొనుగోలును ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. హమాలీ ఛార్జీలు రైతుల ఖాతాల్లోకే వేస్తున్నారని, అందుకే త్వరలోనే వస్తాయని పది రోజుల్లో రాకపోతే స్పందనలో ఫిర్యాదు చేసుకోవచ్చని చెప్పారు. సెక్రటరీ యర్రా శ్రీనివాసరావు వార్షిక నివేదిక సభలో వినిపించారు. ఈ కార్యక్రమంలో త్రిసభ్య కమిటీ సభ్యులు దాసరి సత్యనారాయణ పాల్గొన్నారు.

5న చలో ఢిల్లీ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - నిడమర్రు

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం భువనపల్లి, చానమిల్లి, భావయ్యపాలెం గ్రామాల్లో ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు కోనా శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలని కోరారు. వ్యవసాయ రంగానికి విద్యుత్ మీటర్లు రద్దు చేయాలన్నారు. సిఐటియు నాయకులు గారపల్లి రమణారావు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని ఏప్రిల్ 5న తేదీన ఢిల్లీలో జరిగే ధర్నాలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గవర సత్యనారాయణ, వెలగలేటి మోహన, పిల్లా సూరిబాబు, కంచం వరప్రసాద్, మింది బాపి రాజు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ ఆసరా చెక్కు అందజేత

ప్రజాశక్తి - ముసునూరు



వైఎస్ఆర్ ఆసరా చెక్కు అందిస్తున్న ఎంఎల్‌ఎ

రాష్ట్రంలో మహిళలకు సిఎం జగన్ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేసి ఆదుకుంటున్నారని నూజివీడు ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండల కేంద్రమైన ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎపిఎం దయ్యాల రాజశేఖర్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ ఆసరా చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ మండలంలోని 16 గ్రామాల్లో 1225 స్వయం సహాయక సంఘాలు 12,698 సభ్యులకు రూ.9,80,91,527 మూడో విడత వైఎస్ఆర్ ఆసరా మహిళల ఖాతాల్లో జమ అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్, ఎంపిపి రావర్ల కృష్ణకుమారి, సుబ్బారావు, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయని, ఎంపిడిఒ జి.రాణి, తహశీల్దార్ దాసరి సుధ, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సమాజంపై అవగాహన అవసరం

నూజివీడు: విద్యార్థులు సమాజంపై అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఎఫ్ఐ మాజీ నాయకుడు జి.రాజు అన్నారు. స్థానిక బాలికల హైస్కూల్లో పదో తరగతి మోడల్ ఎగ్జామ్స్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఎస్‌ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జి.రాజు మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పుల వల్ల దేశానికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. అనంతరం ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.జేవిన్ మాట్లాడుతూ నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శారదా కాలేజీ అధ్యాపకులు, బాలికల హైస్కూల్ హెచ్ఎం పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

గంజాయి విక్రేత అరెస్ట్

నూజివీడు : నూజివీడు పట్టణ పరిధిలోని డాక్టర్ ఎంఆర్.అప్పారావు కాలనీలో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ఓ యువకుడిని అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిఐ టి.గోపాలకృష్ణ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు, ఉన్నతాధికారుల ఆదేశానుసారం పట్టణ పరిధిలోని డాక్టర్ ఎంఆర్ అప్పారావు కాలనీలో శుక్రవారం దాడులు నిర్వహించగా 900 గ్రాముల గంజాయి, సెల్‌ఫోన్ సీజ్ చేసి, గంజాయి విక్రయిస్తున్న యువకుడు మాతంగి సంజయ్‌ని అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

కుక్క దాడిలో వ్యక్తికి గాయాలు

పోలవరం : స్థానిక భాను థియేటర్ సెంటర్లో శుక్రవారం ఉదయం ఎస్‌కె ఐజేద్ అనే వ్యక్తిపై పిచ్చికుక్క దాడి చేసింది. ఈ దాడిలో గాయాలపాలైన వ్యక్తిని స్థానికులు ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రానికి తరలించారు. డాక్టర్ రేఖ అతనికి ప్రథమ చికిత్స అందించి, కుక్క కాటు వ్యాక్సిన్ వేశారు. పోలవరం మండల కేంద్రంలో కుక్కల స్వైరవిహారం అధికంగా ఉండడంతో, తరచూ మనుషులపై, పశువులపై, పెంపుడు కోళ్లపై దాడి చేస్తున్నాయని, అధికారులు స్పందించి గ్రామానికి కుక్కల బెడద వదిలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రజాస్వామ్యం గొంతు నొక్కాలనుకోవడం అవివేకం

కార్పొరేషన్‌లో ఎంఎల్‌సి సాబ్జీ విషయంలో వ్యవహరించిన తీరు దుర్మార్గం

మేయరు, డిప్యూటీ మేయరు బేషరతుగా క్షమాపణ చెప్పాలి

బడ్జెట్‌పై కనీస చర్చ లేకపోవడం దారుణం

సిపిఎం, సిపిఐ, సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో మార్చి 29న జరిగిన బడ్జెట్టు సమావేశంలో ప్రజాసమస్యల ప్రస్తావనకు తెచ్చిన ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీని డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు అడ్డుతగలడం, మేయర్ కూర్చోమనడం నగరంలో తీవ్ర దుమారం రేపుతోంది. ఉపాధ్యాయునిగా, ప్రజాసమస్యలపై అనేక ఉద్యమాలు నడిపిన నాయకుడిగా, మేథావులతో ఎన్నికై శాసనమండలి సభ్యునిగా ఉన్న సాబ్జీ కౌన్సిలులో ఎక్స అఫిషియో సభ్యునిగా ప్రజాసమస్యలు ప్రస్తావిస్తుంటే వాటిని అడ్డుకోవడాన్ని వామపక్ష పార్టీలైన సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల న్యూ డెమొక్రసీ తీవ్రంగా ఖండిస్తున్నాయి. ఈ మేరకు ఏలూరు పవర్‌పేటలో ఉన్న సిపిఎం కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పేర్కొన్న అంశాలు వారి మాటల్లోనే...

పాలక వర్గం తీరు దుర్మార్గం

కిషోర్, సిపిఐ నగర అధ్యక్షులు



3.50లక్షల మందికి ప్రాతినిధ్యం వహిస్తున్న కౌన్సిలులో ప్రజాసమస్యల ప్రస్తావన లేకపోవడం హాస్యాస్పదంగా ఉంది. అందునా జిల్లా కేంద్రంగా ఉంది. జిల్లా అధికారులంతా ఇక్కడే ఉన్నారు. ప్రతి ఏటా బడ్జెట్టులో రూ.30 కోట్ల నుంచి రూ.40కోట్లు పెంచుకుంటూ పోతున్నారు. బడ్జెట్‌ను ఆచరణలో చూస్తే పేరుగొప్ప ఊరిదిబ్బగా కనిపిస్తోంది. ఈరోజు బడ్జెట్ భారీగా ఉండొచ్చు. అయితే ఆ నిధులు ఎక్కడ నుంచి వస్తాయి, ఎక్కడ నుంచి తెస్తారు. ఎలా ఖర్చు చేస్తారు అనేది ప్రజలకు తెలియచెప్పాల్సిన బాధ్యత పాలకవర్గంపై ఉంది. గంటలో బడ్జెట్ ముగించడం సిగ్గుచేటు. అందునా ఎంఎల్‌సి సాబ్జీ మాట్లాడుతుంటే అడ్డు తగలటం దుర్మార్గం. ఇలాంటి చర్యలను మానుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోకతప్పదు.

సమస్యలు ప్రస్తావిస్తుంటే కూర్చోమనడం తగదు

బి.సోమయ్య, సిఐటియు జిల్లా అధ్యక్షులు



ఏడాదికాలంలో చేయాల్సిన పనులు, అభివృద్ధి కార్యక్రమాలు కూలంకశంగా చర్చించాల్సిన అవశ్యకత ఉంది. అయితే చేయాల్సినవి చేయకుండా కాస్త సమయంలోనే ఎంఎల్‌సి షేక్ సాబ్జీ అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా దాటవేయడం, డిప్యూటీ మేయరు గుడిదేశి శ్రీనివాసు పదే పదే అడ్డుతగలడం, మేయరు నూర్జహాను కూర్చోమని సంబోధించడం హర్షించదగ్గ పరిణామం కాదన్నారు. గతంలో ఉమ్మడి జిల్లాకు, ప్రస్తుతం నాలుగుజిల్లాల పరిధికి ఎంఎల్‌సిగా ఉన్న వ్యక్తి మున్సిపల్ పాఠశాలలో సిబ్బందికి వేతనాలు, స్కూలు స్వీపర్లకు వేతనాల విషయమై ప్రశ్నిస్తే తగిన సమాధానం ఇవ్వకుండా, అగౌరవంగా కూర్చోమని చెప్పడం సభ్యత కాదన్నారు. కార్పొరేషనులో ఇదే తరహాలో పెద్దలను మాట్లాడనీయకుండా చేస్తే నగరం అభివృద్ధికి పూర్తిగా దూరమవుతుందన్నారు.

మానవీయ విలువలు కుంటుపడిపోతున్నాయి

హేమసుందర్, సిపిఐ నగర అధ్యక్షులు



ఏలూరు నగరపాలక సంస్థలో ఈ నెల 29న జరిగిన సంఘటన అత్యంత హేయమైంది. వాస్తవానికి నగరంలో అభివృద్ధితో పాటు మానవీయ విలువలు కూడా మంటకలిసిపోతున్నాయి. కౌన్సిల్‌లో సమస్యలు ప్రస్తావించేవారి పట్ల రానురాను మర్యాద కూడా తగ్గిపోతోంది. నగరపాలక సంస్థలో 50 మంది కార్పొరేటర్లలో ముగ్గురు మినహా మిగిలినవారంతా అధికార పార్టీ సభ్యులే. దీంతో నగర ప్రజలకు సంబంధించిన సమస్యలను ఎవరూ ప్రస్తావించడంలేదు. కౌన్సిల్ సమావేశంలో కేవలం అరగంటలోనే నగరపాలక బడ్జెటు సమావేశం నిర్వహించడం అశ్చర్యానికి గురిచేస్తోంది. తాజాగా ఏలూరు నగరంలో ఏడు పంచాయతీలను విలీనం చేశారు. అ విలీన పంచాయతీలకు సంబంధించిన సమస్యల ప్రస్తావన గానీ, బడ్జెటు అంచనాలపై కూలంకశంగా చర్చ జరగాల్సి ఉన్నా..ఏ కార్పొరేటరు మాట్లాడకపోవడం విచారకరమన్నారు. ఏలూరు నగరంలో దోమలు, పందులు, డ్రెయినేజీలు, పారిశుధ్యం వంటి ప్రాధాన సమస్యలు ఉన్నా కనీసం వాటిపై చర్చ జరగకుండా మమ అనిపించడం రివాజు అయిపోయిందన్నారు. జగన ప్రభుత్వం వచ్చాక ఏలూరులో రోడ్లు దారుణంగా మారినా ఎలాంటి చర్చ కౌన్సిలులో జరగకపోవడం దారుణమన్నారు. నగరంలో కుక్కల బెడద ఉందని, వాటి నియంత్రణ చర్యలపై చర్చించాల్సి ఉందన్నారు. అలాంటి సమస్యలు చర్చించకపోగా ఎంఎల్‌సి సాబ్జీ మాట్లాడుతూ ఉంటే చెప్పింది చాలే కూర్చోండంటూ మేయర్ సంబోధించడం ఆమె అవివేకానికి నిదర్శనమన్నారు. ఉన్నత స్థానంలో ఉన్నవారి, సభలో పెద్దల మాటకు విలువ ఇవ్వాల్సిన ఆవశ్యకత ఉంది. ఏలూరు నగరపాలక సంస్థలో ఉన్న ప్రజాప్రతినిధులు తమ వైఖరి మార్చుకుని ప్రజా సమస్యలపై చర్చించాలి. పెద్దలకు గౌరవం ఇవ్వాలి.

మౌలిక వసతులపై మాట్లాడితే తప్పా

బద్దా వెంకట్రావు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ నగర అధ్యక్షులు



29న నగరపాలక బడ్జెట్ సందర్భంగా ఎంఎల్‌సి సాబ్జీ మాట్లాడుతుండటంగా మేయర్, అధికార కార్పొరేటర్లు వ్యవహరించిన తీరు దుర్మార్గం. ఏలూరులో అనేక సమస్యలు ఉన్నాయని చెప్తుంటే మేయరు, డిప్యూటీ మేయరు కూర్చోమని ఎంఎల్‌సిని అనడం అప్రజాస్వామికమన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా జరుగుతున్న బడ్జెటు సమావేశంలో కూర్చోమనడం ఏంటని ప్రశ్నించారు. అసలు రాష్ట్ర ప్రభుత్వం ఏమిచ్చిందో చెప్పలేని కౌన్సిలు సమావేశంలో ప్రశ్నించేవారి నోరు నొక్కాలనుకోవడం నిజంగా అప్రజాస్వామికమేనన్నారు. దీనిపై మేయరు,డిప్యూటీ మేయరు, కార్పొరేటర్లు భేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ఉందని, దానిని గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. సాబ్జీ ప్రశ్నలను జీర్ణించుకోలేని మేయర్, డిప్యూటీ మేయరు విధానం సరైందికాదన్నారు. అరగంటలో అరచేతిలో స్వర్గం చూపే బడ్జెట్ అంకెల గారడీ బడ్జెటుగానే భావిస్తున్నామన్నారు. భమ్మిత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

అప్రజాస్వామిక విధానాన్ని ఖండిస్తున్నాం

యు.వెంకటేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ



ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో కొంత కాలంగా ప్రజాస్వామిక విధానాలపై దాడి జరుగుతోంది. 29న జరిగిన బడ్జెట్ సమావేశంలో జరిగిన అప్రజాస్వామిక విధానాలను ఖండిస్తున్నాం. అధికార పార్టీల కార్పొరేటర్లు ఎలాగో మాట్లాడటంలేదు. ప్రతిపక్ష పార్టీల కార్పొరేటర్లు మాట్లాడటంలేదు. కనీసం మాట్లాడే సభ్యుల నోరు నొక్కాలనుకోవడం దారుణం. కేంద్రంలో కూడా మోడీ ప్రభుత్వం మాట్లాడేవారి నోరు నొక్కేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా జిఒ నెంబరు-1 తీసుకొచ్చి ఆందోళనలు, ధర్నాలు, ర్యాలీలు లేకుండా నిలిపేసింది. కేంద్రాన్ని, రాష్ట్రాన్ని ఏలూరు పాలకవర్గం అనుసరిస్తుందని నిరూపించారు. కౌన్సిలులో రూ.237కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టి, ప్రజాస్వామ్య అంశాలపై చర్చించకుండా అరగంటలో ముగించేయడం దారుణం. గత బడ్జెట్ రూ.180కోట్లు దేనికి ఖర్చు పెట్టారో స్పష్టం చేయాలి. ఒకవేళ అభివృద్ధికి ఖర్చు పెట్టి ఉంటే రోడ్లు ఎందుకు వేయలేదు. స్పష్టం చేయలేదు. కార్పొరేటర్ పప్పు ఉమామహేశ్వరరావు కార్పొరేషనులో జరగుతున్న అవినీతిపై మాట్లాడటంలో తప్పే లేదు. అలాంటి వ్యక్తులను గౌరవించాలిగానీ అవహేలనగా మాట్లాడటం ప్రజాస్వామిక విలువలను మంటగలపటమే. బడ్జెట్టు అంకెలగారడీ..అసలు పుస్తకంలో ప్రస్తావించిన ఖర్చులు పద్ధతి ప్రకారం ఖర్చు చేయాలి. లేకపోతే వామపక్ష పార్టీల తరపున ఉద్యమం చేపడతాం. ఎంఎల్‌సి సాబ్జీ విషయంలో చేసిన తప్పుకు పాలకవర్గం బేషరతుగా క్షమాపణ చెప్పాలి.

అద్దె చెల్లించలేదని ప్రయివేటు పాఠశాలకు తాళాలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

అద్దె డబ్బులు చెల్లించాలని ప్రయివేటు పాఠశాల భవనానికి యజమాని తాళాలు వేయడంతో పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు అవస్థలు పడ్డారు. శుక్రవారం పట్టణంలోని కాలేజీ రోడ్‌లో నిర్వహిస్తున్న ఓ ప్రయివేటు పాఠశాల భవనానికి యజమానులు తాళాలు వేశారు. ఉదయం 8:30 గంటల నుంచి పాఠశాలకు వచ్చే విద్యార్థులను అడ్డుకోవడంతో పలువురు విద్యార్థులు ఇబ్బందిపడ్డారు. రోజువారి మాదిరిగా ఆ పాఠశాలలో చదువుకుంటున్న నర్సరీ నుంచి ఏడో తరగతి వరకు విద్యార్థులు కొందరు పాఠశాల బస్సులపై, తల్లిదండ్రుల వాహనాలపై చేరుకున్నారు. అయితే అప్పటికే తరగతి గదులకు వెళ్లకుండా తాళాలు వేసిన యజమానులు విద్యార్థులను అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాల సిబ్బంది యజమానులను నివారించే ప్రయత్నం చేశారు. విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దని ప్రాధేయపడ్డారు. కాని యజమానులు కె.రాంబాబు, నాగేశ్వరరావుగుప్తా, సాయిపవన్‌కుమార్‌లు తమకు గత ఏడు నెలలుగా అద్దె చెల్లించడంలేదని తెలిపారు. పాఠశాల యజమాని జగన్నాథరావు దురుసుగా ప్రవర్తిస్తున్నారన్నారు. అద్దె చెల్లించాలని ఎన్నిసార్లు అడిగినప్పటికీ సరైన సమాధానం చెప్పకపోవడంతో పాఠశాలకు తాళాలు వేయాల్సి వచ్చిందని తెలిపారు. ఏప్రిల్ నెలాఖరు వరకు ఒప్పందం కుదుర్చుకున్నామని, అద్దె డబ్బులు చెల్లించి ఏప్రిల్ నెలాఖరు తరువాత భవనాన్ని ఖాళీ చేయాలని కోరారు. దీనిపై

విద్యార్థుల అవస్థలు

తమకు స్పష్టమైన హామీ ఇచ్చే వరకు విద్యార్థులను పాఠశాలలోకి అనుమతించేది లేదని తేల్చిచెప్పారు. ఈక్రమంలో పాఠశాలకు వచ్చిన విద్యార్థులను సిబ్బంది మరో చోటుకు తరలించడానికి సిద్ధమయ్యారు. ఓ దశలో పోలీస్ సిబ్బంది సంఘటన ప్రాంతానికి వచ్చి సర్దిచెప్పారు. ఇబ్బంది ఉంటే చట్టప్రకారం ఫిర్యాదు చేయాలని సూచించడంతో భవన యజమానులు తమ సమస్యపై పోలీస్ స్టేషన్‌లో తెలియచేయడానికి తరలి వెళ్లారు. దీనిపై ప్రయివేటు పాఠశాల డీన్ కె.సత్యనారాయణను వివరణ కోరగా పాఠశాలకు వచ్చిన విద్యార్థులను, సిబ్బందిని అడ్డుకుని ఇబ్బంది పెట్టడం బాధాకరమన్నారు. పాఠశాల బస్సుకు వాహనాలు అడ్డుగాపెట్టడంతో లోపల ఉన్న విద్యా ర్థులు భయాందోళనకు గురయ్యారన్నారు. యాజమాన్యంతో ఉన్న ఆర్థిక లావాదేవిలను సామరస్యంగా పరిష్క రించుకోవాల్సిఉండగా దౌర్జన్యం కనపరిచారని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.



పాఠశాల బయట విద్యార్థులు

డ్రెయినేజీ నిర్మించాలని ప్లకార్డులతో నిరసన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక 19వ వార్డు ఉప్పల మెట్టలో డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని కోరుతూ ఆ ప్రాంత ప్రజలతో పాటు అధికార పార్టీ కౌన్సిలర్ ఇందిరా ప్రియదర్శిని ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. గత ఏడాదిన్నర కాలంగా నిధులు కేటాయించినప్పటికీ డ్రెయినేజీ నిర్మాణం జరగకపోవడంపై స్థానిక మున్సిపల్ కార్యాలయ గేటు వద్ద ఉప్పలమెట్ట నివాసులతో కలిసి కౌన్సిలర్ ఇందిరా ప్రియదర్శిని ప్లకార్డులను ప్రదర్శిస్తు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఇందిరాప్రియదర్శిని మాట్లాడుతూ తనను కౌన్సిలర్‌గా గెలిపించిన ప్రజలకు ఏపని చేయించలేకపోవడం చాలా బాధాకరమని వాపోయారు. గత 15 నెలలుగా నిధులు మంజూరు చేసినప్పటికీ ఒక్క డ్రెయినేజీ నిర్మాణం జరగలేదని అసహనం వ్యక్తం చేశారు. స్థానిక ప్రజలకు ఏ సమాధానం చెప్పాలో అర్థంకాక ప్రజలతో పాటు నిరసన తెలియచేసినట్లు తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ పి.భవానీప్రసాద్‌కు సమస్యను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప్పలమెట్ట మహిళలు రెబ్బ రాజేశ్వరి, కె.సుబ్బలక్ష్మి, జి.మణికుమారి, పి.వరలక్ష్మి, కె.పరిమళ, జి.ఋుతు పాల్గొన్నారు.

'బహుజనుల సంక్షేమాన్ని గాలికొదిలేసిన వైసిపి'

ప్రజాశక్తి - మండవల్లి

బహుజనులను ఓటు బ్యాంకుగా వినియోగించుకొని అధికారంలోకి వచ్చి బహుజన సంక్షేమాన్ని గాలికి వదిలేస్తున్నారని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్ఎస్.భాస్కరరావు అన్నారు. బిఆర్.అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఆయన శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. కైకలూరు నియోజక వర్గంలో అధికంగా ఉన్న బహుజనులను ఎన్నికల్లో ఉపయోగించుకుని శాసన సభ్యులుగా, మంత్రులుగా ఎన్నో పదవులను అలంకరించి ప్రజా ప్రతినిధులుగా చలామణి అయ్యారే తప్ప బహుజన అభివృద్ధికి కృషి లేదన్నారు. బాబా సాహెబ్ అంబేద్కర్ జిఎంసి బాలయోగి పేరున భవనం నిర్మించడానికి నిధులు మంజూరైనప్పటికీ ప్రజా ప్రతినిధులు చొరవ చూపకపోవడంతో నేటికీ భవన నిర్మాణం జరగలేదన్నారు. ఇప్పటికైనా బహుజనులపై ఉన్న వివక్షతను వీడనాడి అంబేద్కర్ జయంతికైనా భవన నిర్మాణ పనులు ప్రారంభించి బహుజనుల అభివృద్ధికి కాంక్షించాలని కోరారు. లేకపోతే రానున్న ఎన్నికల్లో బహుజనులంతా ఏకమై సత్తా చూపుతామని ఆయన స్పష్టం చేశారు

ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - మండవల్లి

ఎరువులు, పురుగుమందుల విక్రయాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, లేకపోతే లైసెన్స్ రద్దు చేస్తామని వ్యవసాయ శాఖ అధికారిని షేక్ జరీనా అన్నారు. మండలంలోని లోకుమూడిలో ఎరువులు, పురుగుల మందుల షాపుల్లో ఆమె శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరీనా మాట్లాడుతూ ఎరువుల నిల్వ రేటు వివరాలను స్టాక్ బోర్డులో రాసి షాపులు వద్ద ఉంచాలన్నారు. ఎంఆర్‌పి ధరలకే విక్రయించాలని, లైసెన్సులను గడువులోపే రెన్యువల్ చేయించుకోవాలని తెలిపారు. అనంతరం ఎరువులు, పురుగు మందుల శాంపిల్స్ సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కి పంపించినట్లు తెలిపారు.

అటవీ హక్కుల భూముల నిర్వహణపై సర్వే

ప్రజాశక్తి - పోలవరం

అటవీ హక్కుల భూముల నిర్వహణపై జాతీయ మానవ హక్కుల కమిషన్, ఇండియన్ ట్రైబల్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యుల బృందం మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో శుక్రవారం సర్వే విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా బృందం డైరెక్టర్ అక్షయ్ మహాపాత్ర మాట్లాడుతూ అర్హులైన గిరిజనుల్లో సామూహిక భూముల పంపిణీ, వ్యక్తిగత భూముల పంపిణీ అంశాలపై జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ, అటవీ శాఖ, ఐటిడిఎ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో పునరావాస గ్రామాలకు తరలించిన గిరిజన నిర్వాసితుల సమస్యలు, మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై సర్వే నిర్వహించినట్లు చెప్పారు. వారికి మౌలిక వసతులు అందుతున్నాయా లేదా, ఉపాధి హామీ చట్టం, గృహ నిర్మాణం ఇతర మౌలిక వసతులు, పలు అంశాలను పరిశీలించామని, ఈ విషయాలను కేంద్రానికి నివేదిక పంపుతామని తెలిపారు. తహశీల్దార్ బి.సుమతి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో తరలించిన సరుగుడు, పైడాకుల మామిడి గ్రామాలకు ఆర్ఒఎఫ్ భూములకు పరిహారం కోసం కేంద్రానికి నివేదిక పంపమని అధికారులను కోరినట్లు తెలిపారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - చింతలపూడి

చెడు వ్యాసనాలకు దూరంగా ఉండాలని చింతలపూడి ఇన్‌ఛార్జి న్యాయమూర్తి పరేష్‌కుమార్ అన్నారు. చింతలపూడి పట్టణంలో శుక్రవారం ఆయన సబ్‌జైల్‌ను సందర్శించి అందులో నిందితులకు అందుతున్న ఆహార, వసతి సదుపాయాల గురించి, కేసు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పరేష్‌కుమార్ మాట్లాడుతూ న్యాయవాదిని పెట్టుకునే స్తోమత లేనివారికి ఉచితంగా కోర్టు న్యాయవాదిని ఏర్పాటు చేస్తుందని తెలిపారు. జైలు నుంచి బయటకు వెళ్లిన తరువాత ప్రవర్తనలో మార్పు తెచ్చుకుని జీవించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు యల్‌వి.చైతన్య, టోకురి వెంకటేష్, సోషల్ వర్కర్ అక్బర్ అలీ, జైల్ సూపరింటెండెంట్ గోలి వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో హుండీల లెక్కింపు

ప్రజాశక్తి- ద్వారకాతిరుమల

ద్వారకా తిరుమల వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో హుండీల ఆదాయాన్ని శుక్రవారం ఉదయం అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ లెక్కించారు. ఈ హుండీల లెక్కింపు ద్వారా స్వామివారికి గడచిన 16 రోజులకు రూ.1,32,12,581 ఆదాయం వచ్చింది. భక్తుల కానుకల రూపేన 176 గ్రాముల బంగారం, మూడు కేజీల 394 గ్రాముల వెండి, పాతనోట్లు రూ.500 (6), రూ.వెయ్యి నోటు ఒకటి, పలు దేశాల విదేశీ కరెన్సీ సైతం లభించింది. 2021-2022 సంవత్సరానికి రూ.31,76,33,101, 2022-2023 సంవత్సరానికి రూ.35,46,92,522, గత సంవత్సరం కన్నా ఈ ఏడాది రూ.3,70,59,421 ఆదాయం అధికంగా వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వేండ్ర త్రినాథరావు తెలిపారు.

బాధిత కుటుంబానికి వైష్ణవి సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి అంబేద్కర్‌నగర్‌కు చెందిన దూబా సుమన్ (41) ఇటీవల పాము కాటుకు గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అమరావతి మాజీ బ్రాండ్ అంబాసిడర్, వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవి తన తండ్రి అంబుల మనోజ్ ద్వారా మృతుని కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం అందించారు. శుక్రవారం బాధిత కుటుంబసభ్యులను డాక్టర్ మనోజ్ పరామర్శించి రూ.ఐదు వేలు నగదు, నెలరోజులకు సరిపడా నిత్యావసర సరుకులు అందించారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

బాలింతలకు, పిల్లలకు చిరుధాన్యాలతో కూడిన ఆహారం అందించడం ఆరోగ్యకరమని మహిళా శిశు సంక్షేమ శాఖ రీజయన్ ఛైర్మన్ వందనపు సాయి బాల పద్మ తెలిపారు. స్థానిక శాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సెక్టార్ సమావేశంలో వందనపు సాయిబాల పద్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరించే పోషణ పక్వాడ్ లబ్ధిదారులైన తల్లులకు కిశోర బాలికలకు పూర్తి అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు.